
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 । కనిష్ఠం 20.6



కామారెడ్డి ఆర్టీవోగా కే.శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17: కామారెడ్డి జిల్లా రవాణాశాఖాధికారిగా కే.శ్రీనివాస్‌రెడ్డి శనివారం నియామకమయ్యారు. గతంలో ఇక్కడ ఆర్టీవోగా పని చేసిన ఎస్.వాణి హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం కే.శ్రీనివాస్‌రెడ్డి ఆర్టీవో కార్యాలయంలోనే మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా ఆయననే ఆర్టీవోగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు ఆర్టీవో కార్యాలయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. వాహనదారులు నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు.



పల్లెలకు విస్తరించిన మెడికల్ మాఫియా

- పల్లెలకు విస్తరించిన మార్కెటింగ్ సిస్టం
- ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రైవేట్ ఆసుపత్రుల ఆఫర్లు
- కమీషన్ల కోసం కొందరు అనైతిక పద్ధతులు
- జిల్లాలో స్థాయికి మించిన వైద్యంతో సామాన్యులకు చిక్కులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17: వైద్యోనారాయణో హరి.. అనేది నానుడి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి జ్వరం నుంచి పెద్దపెద్ద గాయాలైన వారికి సైతం స్థానిక ప్రైవేట్ వైద్యులే చికిత్స చేసి తక్కువ ఖర్చుతో ప్రాణాలను కాపాడే వారు. అందుకే వారిని ప్రజలు దేవుడితో సమానంగా భావించేవారు. కానీ రానురాను ఆ పరిస్థితి మారిపోతుంది. పల్లెలు, మారుమూల గ్రామాలే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని కొన్ని వీధులే లక్ష్యంగా చేసుకుని మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ మాఫియాలా మారిపోతోంది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఆర్ఎంపీ, పీఎంపీలను లక్ష్యంగా చేసుకుని ఆఫర్లతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ ఆఫర్ల మైకంలో పడిన కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు అడ్డదారులు తొక్కుతూ అనైతిక వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సామాన్యులు ఆరోగ్యంతో పాటు డబ్బు కూడా నష్టపోతున్నారు.

మార్కెటింగ్ మాయ

ఒక్కప్పుడు హైదరాబాద్ కేంద్రంగా ఉండే బడా కార్పొరేట్ ఆసుపత్రులు తమకంటూ ప్రత్యేకంగా మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేది. వివిధ జబ్బులతో బాధపడే వారిని తమ వద్దకు రిఫర్ చేయాలంటూ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులను కోరేది. అలా ఆసుపత్రుల మధ్య పోటీ పెరిగి చివరకు జిల్లా కేంద్రాల నుంచి గ్రామాల వరకు మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ విస్తరించింది. చిన్న, పెద్ద, కొత్త, పాత తేడా లేకుండా వ్యాధిగ్రస్తులను రిఫర్ చేసిన ఆర్ఎంపీ, పీఎంపీలకు ఆకర్షణీయమైన ఆఫర్లు, ప్యాకేజీలను ప్రైవేట్ ఆసుపత్రులు ప్రకటిస్తున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద, పిట్లంలలో ఉన్న పలు ప్రైవేట్ ఆసుపత్రులు బంపర్ ఆఫర్లు ఇస్తున్నాయి. ఈ బంపర్ ఆఫర్లు ప్యాకేజీలు అనేక రకాలుగా ఉంటున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీలు పంపిన వారు ఇన్‌పేషంట్‌గా చేరితే ఆ రోగికి చెల్లించే ఫీజులో 30 శాతం, వివిధ టెస్టులకు సంబంధించి వేసే బిల్లుల్లో 50 శాతం వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. కొన్ని కొత్త ఆసుపత్రులయితే నిలదొక్కుకునేందుకు ఔట్ పేషంట్ విభాగంలోనూ ఆఫర్లు అందిస్తున్నాయి. ఒక నిర్ణీత సమయంలో లక్ష్యానికి మించి రోగులను రిఫర్ చేసినట్లయితే విదేశాలకు టూర్లను కూడా ఆఫర్ చేస్తున్నారు.

సామర్థ్యానికి మించి

నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాలి. సర్టిఫైడ్ డాక్టర్ సూచించిన ప్రిస్క్రిప్షన్ ఆధారంగా సెలెన్ పెట్టడం, మందులు ఇవ్వడం, ఇంజెక్షన్ వేయడం వంటి సేవలు చేయవచ్చు. నేరుగా పరీక్షించడం, రోగ నిర్ధారణ చేయడం మందులు ఇవ్వడం చేయకూడదు. కానీ ఈ నిబంధన అమలు కావడం లేదు. అయితే ఇదే సమయంలో తక్షణ వైద్యసేవలు అందించే వారిగా ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రజల మనసును గెలుచుకుంటున్నారు. దీంతో కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు తమ సామర్థ్యానికి మించి వైద్యసేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలకు చేటు తెస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఈ తరహ ఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి.

సెటిల్‌మెంట్లతో సరి

ఔషధాలకు ఉండే పరిమితులు, శరీర ప్రతిస్పందనలు తదితర అంశాలపై అవగాహన లేకుండానే ఆర్ఎంపీ, పీఎంపీలు వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు గర్భ విచ్ఛిత్తి మాత్రలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పలు గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు చూసిన సంఘటనలు ఉన్నాయి. ఏదైన అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు గ్రామ స్థాయిలో వాటిని సెటిల్‌మెంట్ చేస్తూ విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు.

కమీషన్లకు కక్కుర్తి

ప్రైవేట్ ఆసుపత్రుల మార్కెటింగ్ విభాగాలు అందిస్తున్న ఆఫర్ల మైకంలో ఉంటున్న ఆర్ఎంపీ, పీఎంపీలు నైతికంగా దిగజారిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వైద్యసేవల కోసం తమ వద్దకు వచ్చే వారిని అవసరం లేకున్నా ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్‌చేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. ఎక్కువ మొత్తంలో కమీషన్లు వచ్చేందుకు అవసరం లేకపోయినా వివిధ పరీక్షలు, అధిక మందులు రాయాలంటూ కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. తాము చెప్పినట్లు అధికంగా టెస్టులు మందులు రాయకపోతే మరో ఆసుపత్రికి రిఫర్ చేస్తామని శాసించే స్థాయికి ఆర్ఎంపీలు, పీఎంపీలు చేరుతున్నారని పలు ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు సైతం చెబుతున్నారు. అయితే ప్రభుత్వపరంగా ఆసుపత్రుల మార్కెటింగ్, రిఫర్ చేసే పద్ధతుల నివారణకు ఎటువంటి నిబంధనలు లేవు. ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ మరింత నిఘా పెట్టి మెడికల్ మాఫియాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సలాబత్‌పూర్ ఆలయంలో భక్తుల సందడి

మద్నూర్, ఫిబ్రవరి 17: మద్నూర్ మండలంలోని మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తెల్లవారు జాము నుంచే భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సత్యనారాయణ వ్రతాలను చేశారు. మహారాష్ట్ర నుంచి భక్తులు కాలినడకన వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ శనివారం ఆలయంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదేవిధంగా మూడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాం

ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17: ప్రజలకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, పంపరి శ్రీనివాస్, గడ్డమీది రాణి భర్త మహేష్‌లు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీలో ఉన్న చాలా మంది నేతలు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీల్లో ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణంతో పాటు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10లక్షల వరకు వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. త్వరలోనే గృహజ్యోతి ద్వారా 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, గ్యాస్ ధరను రూ.500లకే అందించేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. త్వరలో ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడంతో పాటు రైతులు పండించిన ప్రతీ పంటకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే వారికి ఐదు లక్షలు ఇస్తు, రైతుబంధును ఎకరాకు రూ.15 వేలకు అందించబోతున్నట్లు తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు రూ.4వేల పెన్షన్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, సందీప్, మున్సిపల్ కౌన్సిలర్‌లు అన్వర్, పాత శివకృష్ణమూర్తి, రవీందర్‌గౌడ్, చాట్ల వంశీ, ఉరుదొండ వనిత, పాక జ్ఞానేశ్వరి, రవి, సుగుణ, మమిళ్ల రమేష్, నాయకులు రవిప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుదోండ రవి, అంజ ద్, సాయిబాబా, శంకర్ రావు, ప్రసాద్, వేణు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ కోసం కృషి చేస్తాం

కామారెడ్డి పట్టణంలో ప్రెస్‌క్లబ్ కోసం కృషి చేస్తామని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు.శనివారం కామారెడ్డిలోని పలువురు ఎలక్ట్రానిక్‌ప్రింట్ మీడియా విలేకరులు ప్రెస్‌క్లబ్ విషయమై ఆయనను కలిశారు.ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ప్రజలకుప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేసే మీడియా ప్రతినిధులకు ఒక వేదిక అనేది ఉండాలని అన్నారు. ఎక్కడైన ప్రజలు తమ హక్కులకు భంగం కలుగుతుం దని భావించినప్పుడు మీడియా అనేది ప్రధాన పాత్ర పోషించి సమస్యకు పరిష్కారం చూపే వేదిక కావాలని అన్నారు. అనంతరం కలెక్టర్‌తో మాట్లాడి ప్రెస్‌క్లబ్ విషయం లో తగిన సహకారంను మీడియా ప్రతి నిధులకు అందించాలని సూచించారు.

రాజకీయాల్లో ఒడిదొడుకులు సర్వ సాధారణం

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17: రాజకీయాల్లో ఒడిదుడుకులు సర్వ సాధారణమని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేయడంతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో కష్టసుఖాలు రెండు ఉంటాయని ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉంటే ఎక్కడా కూడా కక్ష్య సాధింపు చేయలేదని అన్నారు. తన సొంత గ్రామం బస్వాపూర్‌లో పలువురు యువకులు ఫ్లెక్సీ చించే సారని పోలీసు స్టేషన్‌కు ఎస్ఐ పిలిపిస్తే అక్కడికి వెళ్లారని పోలీసుస్టేషన్‌కు వెళ్లిన యువకులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డిలతో పాటు మరో 15 మంది యువకులపై దాడి చేశారని అన్నారు. దీంతో తాను ఎస్పీతో మాట్లాడడంతో దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేశారని అన్నారు. పోలీసు స్టేషన్‌లను కాంగ్రెస్ కార్యాలయాలు చేస్తే ఊరుకోమని అన్నారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు తాము అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవి, ఎంపీపీ నర్సింగ్‌రావు, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి గైని శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న గంప గోవర్ధన్

జోరుగా బియ్యం దందా

- జిల్లాలో కొనసాగుతున్న రేషన్ బియ్యం దందా
- సమాచారం రాగానే దాడులే తప్ప మూలాల్లోకి వెళ్లని దర్యాప్తు
- సమగ్ర విచారణ జరిపి నిర్మూలనకు కృషి చేయని అధికారులు
- చిన్నపాటి కేసులతో సరిపెడుతుండడంతో మళ్లీ అదే దందా



తాడ్వాయిలో ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లు ఖర్చు చేసి పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ దుకాణాల్లో వస్తున్న చాలా వరకు బియ్యంను తినేదానికంటే నిల్వ చేసి ఎక్కువ ధరలకు అమ్ముకునేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ బియ్యం సేకరణకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ముఠాలే పని చేస్తున్నాయి. చైన్ సిస్టంల పనిచేస్తూ ఒకరి నుంచి ఒకరు ప్రజల నుంచి బియ్యం సేకరిస్తున్నారు. వాటిని పెద్ద మొత్తంలో సేకరించి పలువురు వ్యాపారులు రైస్‌మిల్లులకు, చేపల పెంపకానికి, పౌల్ట్రీ పరిశ్రమలకు సరఫరా చేయడం లేదంటే మహారాష్ట్ర లాంటి ప్రాంతాలకు ఎగుమతి చేయడం చేస్తున్నారని తెలుస్తోంది. కిలోకు రూ.10 వరకు కమీషన్ మిగులుతుండడంతో చాలా మంది దీనినే వృత్తిగా మలుచుకుంటున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని కొందరు మిల్లుల యజమానులు, సీఎంఆర్‌గా తరలిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. అధికారులు, పోలీసులు దాడులు చేసిన సమయంలో పట్టుబడిన వారిపై చిన్నపాటి కేసులు నమోదు చేస్తుండడం, పట్టుకున్న బియ్యం భారీ మొత్తంలో ఉంటే పౌర సరఫరాల గోదాంలోకి, తక్కువ మొత్తంలో ఉంటే సమీపంలోని రేషన్ దుకాణాలకు అప్పగించి ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను కోర్టుకు అప్పగిస్తున్నారు. అత్యవసర సరుకుల చట్టం 1955 చట్టంలోని 6ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తున్నారు. చిన్నపాటి శిక్షలు ఉండడంతో రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్టపడడం లేదని దీంతో కొన్ని రోజులు స్తబ్ధంగా ఉంటున్నా తిరిగి మళ్లీ అదే దందాలోకి వస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నమోదవుతున్నాయి. ఇటీవల కామారెడ్డి, తాడ్వాయి మండల శివారులో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యాన్ని, ఆటోలో తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.

మూలాల్లోకి వెళ్లని దర్యాప్తు

జిల్లాలో రోజుల వ్యవధిలోనే అధికారులు అక్రమంగా నిల్వ ఉంచి తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకుంటున్నారు. కానీ వాటి మూలాల్లోకి మాత్రం వెళ్లడం లేదని సమాచారం. బియ్యం పట్టుకున్న వెంటనే సమగ్ర విచారణను చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టుబడిన వ్యక్తులు ఎక్కడి నుంచి వాటిని సేకరించారు. ఎన్ని నెలల నుంచి ఈ వ్యాపారం సాగుతుంది. తదితర అంశాలపై లోతుగా దర్యాప్తు జరగకపోవడం వల్లనే

ఇళ్ల వద్దే దందా

గతంలో రహస్యంగా జరిగిన ఈ దందా ఇప్పుడు బహిరంగంగానే కొనసాగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో, గ్రామాల్లో కొంత మంది బియ్యం వ్యాపారులు, దుకాణ సముదాయాల నిర్వాహకులు, మిల్లర్లు ఆటోల్లో వేయింగ్ మిషన్‌లు తీసుకుని నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళుతూ కొనుగోలు చేస్తున్నారు. ఒకరిని చూసి ఒకరు ఇలా బియ్యాన్ని దళారులకు అమ్ముకుంటుండడంతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా జరుగుతోంది. రవాణా చేసే వాహనాలకు అడ్వాన్సు మొత్తం ఇచ్చి రేషన్ బియ్యం తెప్పిస్తున్నారంటే దందా ఎంత పకడ్బందీగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. బియ్యం తరలింపునకు ఉపయోగించే వాహనాలను తమ పేరుపై లేకుండా వ్యాపారులు జాగ్రత్త పడుతున్నారు. బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు మూడు సార్లు పట్టుబడితే వారిపై పీడీయాక్ట్ నమోదు చేయాలి. దీంతో పట్టుబడిన సమయంలో వారి పేర్లు లేకుండా జాగ్రత్త పడుతుండడంతో మధ్యవర్తుల మీద కేసులు నమోదైనా మళ్లీ ఇదే దందా సాగించడమో లేదంటే వారి ప్రతినిధులను ఈ వ్యాపారంలో దింపి వెనుక నుంచి నడిపించడం లాంటివి చేస్తున్నారని తెలుస్తోంది. దొరికిన బియ్యానికి లెక్కలు అడిగి చర్యలు తీసుకుంటున్నారు తప్పితే వారి వ్యాపార చరిత్రపై ఆరా తీయడం లేదు. పేదలకు అందించిన బియ్యాన్ని అక్రమంగా రైస్‌మిల్లులకు పంపి రీసైకిల్ చేయడం లేదంటే ఇతర ప్రాంతాలకు తరలించడం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17:జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 19న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాను మెడ్‌ప్లెస్ కంపెనీ నిర్వహిస్తోందని ఫార్మసిస్టు, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఫార్మసి విత్ టీసీఐ విద్యార్హత కలిగి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొన వచ్చని అన్నారు. 19వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల లోపు అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటో, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన కోరారు.

సిరిపూర్‌లో బైక్ దగ్ధం

మోపాల్, ఫిబ్రవరి 17:మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిపూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన తస్మియ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారని బాధితురాలు శనివారం మోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి సైన్స్ దినోత్సవ వేడుకలు

డొంకేశ్వర్, ఫిబ్రవరి17: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి పోటీలను నిర్వహించారు. 8, 9తరగతి విద్యార్థులకు సైన్స్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో 15మంది పాల్గొనగా 8వ చదువుతున్న సహస్ర ప్రథమస్థానంలో, రక్షిత ద్వితీయ స్థాయంలో నిలిచింది. ఈనెల 20న జరిగే జిల్లాస్థాయి పోటీలలో విద్యార్థినులు పాల్గొంటారన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 17: చిన్న వయస్సులో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన నారాయణ పాఠశాల విద్యార్థిని శ్రీనిధిని శనివారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, డీఈవో దుర్గా ప్రసాద్‌లు అభినందించారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోగల నారాయణ పాఠశాలలో పీపీ-1 చదువుతున్న శ్రీనిధి చిన్న వయస్సులోనే 28 భారత రాష్ట్రాల రాజధానులు, 9 జాతీయ చిహ్నాలు, 5 జ్ఞానేంద్రియాలు, గాయత్రీ మంత్రం, గణితంలో రెండవ ఎక్కాలను చదవడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించిందని ఈ సందర్భంగా కలెక్టర్, డీఈవోలు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల తెలంగాణ జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శివాజీ పాటిల్, ప్రిన్సిపల్ జ్యోష్న తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత అచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతోపాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

డిచ్‌పల్లిలో కేసీఆర్,బాజిరెడ్డి జన్మదిన వేడుకలు



కేసీఆర్, బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, మాజీ సీఎం కేసీఆర్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ల జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం డిచ్‌పల్లి మూప్పై పడకల ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మోపాల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గో వర్ధన్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మొచ్చ శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మో పాల్ మండల కేంద్రంలో ఉన్న తల్లి తెలంగాణ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేసీఆర్, బాజీరెడ్డి గోవర్ధన్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు. వీరిద్దరు ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు జీవించాలని ఆ పార్టీ నాయకులు దేవుళ్లను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు లత కన్యరాం, రైతు సమన్వయ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, కన్యరాం, నాయకులు నరేష్, శ్యామ ముత్యంరెడ్డి, తాజామాజీ ప్రజాప్రతినిధులు సాయి రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ సుమన్, సిద్దార్థ, రింగుల భూ మయ్య, అజీం, జగదీష్, నరేందర్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రీపెయిడ్ మీటర్ల ఆలోచన మానుకోవాలి

సుభాష్‌నగర్,ఫిబ్రవరి17:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్ల ఆలోచనను మానుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయ పీవో పోశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి బీజేపీ దేశంలో ఉన్న విద్యుత్ వినియోగదారులకు ప్రీపేడ్ మీటర్ల నెట్‌వర్క్‌లోకి తేవాలని, స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రస్తుతం ఉన్న మీటర్లను తొలగించాలని చూస్తోందని అన్నారు. ప్రీపేడ్ మీటర్లు ప్రవేశపెడితే వినియోగదారులపై మరింత భారం పడనుందని అన్నారు. కరెంట్ ప్రీపేడ్ మీటర్ల ఆలోచనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి ఓమయ్య, జిల్లా నాయకులు రంజిత్, హన్మాండ్లు, సురేష్, రాధా, కుమార్, పాల్గొన్నారు.

ఇసుక, గంజాయి రవాణాపై చర్యలు చేపట్టాలి

బోదన్ రూరల్, ఫిబ్రవరి17: బోధన్, సాలూర మండల మంజీర సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా రవాణా అవుతున్న ఇసుక, గంజాయిలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని బోధన్ రూరల్ సీఐ కోల నరేష్ అన్నారు. శనివారం సాయంత్రం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, పెండింగ్ కేసులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం ఖండ్‌గావ్ గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్‌లను పట్టుకోవడం జరిగిందన్నారు. ఎంతటి వారైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు కొరకు వచ్చే ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై నాగనాథ్, ఏఎస్సై రవీందర్లతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న రూరల్ సీఐ

కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచి పోతాయి

● కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేస్తున్న దృశ్యం



ఏర్గట్లలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు



కోటగిరిలో..

బోధన్‌రూరల్, ఫిబ్రవరి17: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన హయాంలో పేద ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ అన్నారు.శనివారం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేసిన తెలంగాణబాపు అని కొనియాడారు. నిండు నూరేళ్లు ఆయుఆరోగ్యాలతో ఉండాలని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, కౌన్సిలర్లు కొండ్ర పద్మ, అశ్వక్, ధూప్‌సింగ్, నక్క లింగారెడ్డి, అబ్దుల్ రజాక్, రవిశంకర్‌గౌడ్, భవానిపేట్ శ్రీనివాస్, శంకర్‌గౌడ్, ప్రవీణ్‌జాదవ్, ఎన్నార్షైమద్. మసూద్, శ్రీనివాస్, మేడి రవి, సాయిలు, తదితరులు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల బీఆర్ఎస్ అధ్యక్షులు ఏజాజ్ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్, బీఆర్ఎస్ నాయకులు వీరేశం, సాయిలు, మాణిక్ అప్ప, కాశ గౌడ్, హంగర్గ గంగాధర్, మాజీ సర్పంచ్‌లు పత్తి లక్ష్మణ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. అనంతరం విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తెడ్డు పోశెట్టి, నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, ఎంపీటీసీలు జనార్ధన్, కృష్ణ మోహన్ రావు, నాయకులు సూరిబాబు, శ్రీనివాస్ గౌడ్, లోకం నర్సయ్య, సతీష్, అప్సర్, తదితరులున్నారు.

రెంజల్: రెంజల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు భూంరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం మండల బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలపార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్ మండల నాయకులతో కలిసి కేక్‌ను కట్ చేసి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండలఅధ్యక్షుడు బద్దం రాజేశ్వర్, ఎంపీటీసీ మైలారం సుధాకర్, హైమద్, రాజేశ్వర్, ఓంకర్ శ్రీనివాస్ నరేందర్, కొరె నర్సయ్య, హల్దె కిషన్, రఘు, మహేందర్, గంగారెడ్డి, కౌడ భూమేశ్వర్, మురళి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఏర్గట్ల: మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ 70వ జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు శనివారం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి,జడ్పీటీసీ గుల్లెరాజేశ్వర్, భారస మండలాధ్యక్షుడు ఎనుగందుల రాజా పూర్ణానందం, కోఆప్షన్ సభ్యుడు ఎండి అశ్రఫ్, పిఏసిఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, బద్దం ప్రభాకర్, రాజారాం సహదేవ్, కొలిప్యాక శ్రీనివాస్, ఓర్సురాములు, రాజారాం సహదేవ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: భీమ్‌గల్ పట్టణంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. టపాసులు కాల్చి, మండల పరిషత్ ఆవరణలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటినర్సయ్య,ఒరగంటి గంగాధర్,మండల బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగకరంగా కల్యాణ మండపాలు

● కాంగ్రెస్ హయాంలో ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాం ● 20న పరిరక్షణ కమిటీ రాక ● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



కళ్యాణ మండపానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోదన్ రూరల్/ఎడపల్లి, ఫిబ్రవరి17: పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగపడేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ మండపాలను నిర్మిస్తుందని బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ శివారులోగల శ్రీ లక్ష్మి నర్సింహస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం కళ్యాణ మండప నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.78 లక్షలనిధులతో అన్ని రకాల అధునాతన హంగులతో కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యత లోపాలు లేకుండా వాస్తు ప్లాన్ ప్రకారం వంటగది, భోజనశాల, కళ్యాణ వేదికను ఏర్పాటు చేయాలన్నారు. మూడు నాలుగు నెలలలోపు నాణ్యత లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనులపై పర్యవేక్షించాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శ్రీ లక్ష్మి నర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎడపల్లి సొసైటీ చైర్మన్

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పోల మల్కారెడ్డి, బాపు నగర్ మాజీ సర్పంచ్ సునీత రవిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రజితా యాదవ్, జైతాపూర్ సింగిల్‌విండో చైర్మన్ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, నాయకులు బిల్లా రాం మోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే

బోధన్ రూరల్: నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని మూసివేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మాజీ సీఎం. కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, కేటీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమయ్యారని బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. శనివారం బోదన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం కమిటీ వేయడం జరిగిందన్నారు. ఈ నెల 15వ తేదీన సచివాలయంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీపై కమిటీ సభ్యులతో మాట్లాడడం జరిగిందన్నారు. ఈ నెల 20న పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్‌లతో పాటు కమిటీ సభ్యులు నిజాం షుగర్ కర్మాగారాన్ని, పరిసరాలను పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్,మండలఅధ్యక్షుడు నాగేశ్వర్ రావు, పాషా మొయినొద్దీన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన్ రూరల్: దివ్యాంగులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, అంగవైకల్యం దేనికి అడ్డు రాదని అధైర్య పడొద్దని బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 17: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ తల్లి ప్రాంగణంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ఆదిమూలం సతీష్, నాయకులు రఘువీర్‌గౌడ్, ఇమ్రాన్, నారాయణ, బబ్లూ, కౌన్సిలర్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గర బీఆర్ఎస్ నాయకులు కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడి సాధించిన వ్యక్తులలో కేసీఆర్ మొదటి స్థానంలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీపీ విఠల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కంది మల్లేష్, రాము, మోహన్, మైసాగౌడ్, శ్రీనివాస్, సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ బీఆర్ఎస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి తదితరులున్నారు.



మహ్మద్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ



నసురుల్లాబాద్‌లో..



ఎల్లారెడ్డిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ: పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని భవిష్యత్తులో ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వెంకట్రామ్‌రెడ్డి, ఎజాజ్, పిట్ల శ్రీధర్, పాత బాలకృష్ణ, వైస్‌చైర్మన్ జుబేర్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని అక్కాపూర్ గ్రామంలో మండల అధ్యక్షుడు బాలచంద్రం, ఎంపీటీసీ లత కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రమేష్, మాజీ సర్పంచ్ మమత, బాబు, ఉప సర్పంచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతగా విద్యార్థి ప్రణీత్

రాజంపేట, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో పాఠశాలకి ఇద్దరు విద్యార్థుల చొప్పున సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంటసేపు ఆన్‌లైన్ విధానంలో సాగిన పరీక్షల్లో జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల రాజంపేట విద్యార్థి ప్రవీణ్ ప్రథమ స్థానంలో, తలమడ్ల ఉన్నత పాఠశాల విద్యార్థి అజయ్ ద్వితీయ స్థానాన్ని పొందడం జరిగిందని తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ జ్ఞాపికలను అందజేసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చక్రపాణి, సాయిరెడ్డి, రమేష్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, జబ్బర్, సిద్దికి, త్రివేణి, శ్రీవిద్య, అంజనేయులు, రేణుక, దేవి తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

బరంగేడ్గిలో కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నాయకులు

బీర్కూర్, ఫిబ్రవరి 17: మండలంలోని బరంగేడ్గి గ్రామానికి చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యదర్శి కాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఇందులో భాగంగా బరంగేడ్గి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దేవానంద్ దేశాయ్, అశోక్, దశరథ్‌లతో పాటు 50మంది కార్యకర్తలు ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కాంత్‌రెడ్డి, నాయకులు బస్వరాజు, శంకర్, కమలాకర్‌రెడ్డి, ఇక్బాల్, గొండ్ల శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ ఉప సర్పంచ్ పరమేశ్వర్‌రెడ్డితో పాటుగా పలువురు శనివారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి షబ్బీర్‌అలీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మాచారెడ్డి సింగిల్ విండో డైరెక్టర్‌లు

మాచారెడ్డి: మాచారెడ్డి సింగిల్ విండో డైరెక్టర్‌లు స్వామిగౌడ్, బుచ్చిరెడ్డి, నారెడ్డి రవి, నర్సారెడ్డి, భూమయ్య, ధర్మాజీ కిషన్, బైండ్ల కళావతి భర్త రామస్వామి, సావిత్రి భర్త కాశీరెడ్డి, లచ్చపేట సింగిల్‌విండో డైరెక్టర్ బాలరాజులు శనివారం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి షబ్బీర్‌అలీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా మాచారెడ్డి సింగిల్‌విండో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి నిజామాబాద్ తరలివెళ్లారు.

ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి బీజేపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, నిజాం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై బీజేపీ నాయకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

దోమకొండ, ఫిబ్రవరి 17: మండలంలోని అంచనూర్ గ్రామానికి చెందిన నందు అనే వ్యక్తి సెల్‌ఫోన్ దోమకొండ బస్టాండ్ వద్ద పోగొట్టుకున్నాడు. వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ గణేష్ సీఈఐఆర్ యాప్ ద్వారా పోగొట్టుకున్న ఐక్యూజడ్6 ప్రో ఐ 2126 సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి శనివారం పోలీసుస్టేషన్‌లో అందించారు.

రేపు వాహనానికి వేలం

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17: కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన ఆటోను సోమవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ వాహనానికి ప్రారంభ ధర రూ.42 వేలు ఉందని, 18 శాతం జీఎస్‌టీ కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు ముందుగా రూ.5వేల డిపాజిట్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని సీఐ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాజు (ఫైల్)

బీర్కూర్, ఫిబ్రవరి 17 : బీర్కూర్ శివారులోని మంజీరా నదిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో బీర్కూర్‌కు చెందిన కుర్మ రాజు(33) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బీర్కూర్‌కు చెందిన రాజుకు గొర్రెలు ఉన్నాయి. వాటిని మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం గొర్రెలు తీసుకుని మహారాష్ట్రకు వెళ్లాడు. అక్కడే గొర్రెలు మేపుతూ ఆరోగ్యం బాగా లేకపోవడంతో రాత్రి ద్విచక్రవాహనంపై బీర్కూర్‌కు బయలు దేరాడు. ఈ క్రమంలో మంజీరా నది బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం రాజు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుర్మ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యాశాఖలోని అవకతవకలను సరి చేయాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17: విద్యాశాఖలోని అవకతవకలను సరిచేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు శనివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసీజీఈ పోస్టును గెజిటెడ్ హెడ్ మాస్టర్‌లలో సీనియర్‌గా ఉన్న వారిని నియమించాలని, నిబంధనల ప్రకారం ఆ పోస్టుకు 2 సంవత్సరాల కాలపరిమితి మాత్రమే ఉంటుందని సుదీర్ఘకాలంగా ఒక్కరే ఉండడం వల్ల నియంతృత్వ ధోరణి పెరిగిందని తెలిపారు. ఇతర ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను తృణీకరిస్తున్నారని, ప్రతీ సంవత్సరం ఎలాంటి ప్రకటన లేకుండా డీఈవో ఏసీజీఈని రెన్యూవల్ చేస్తున్నారని అన్నారు. అలాగే డీఎస్‌వో పోస్టును కూడా ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లకు లేదా గెజిటెడ్ హెడ్‌మాస్టర్‌లకు సైన్స్ సబ్జెక్ట్‌తో ఉన్న వారికి ఇవ్వాలని అన్నారు. ప్రస్తుతం డీఎస్‌వోగా చేస్తున్నవారు కోర్టు నుంచి స్టే తీసుకొచ్చి చేస్తున్నారని, నిబంధనల ప్రకారంగా హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ వారికి ఇవ్వాలని తెలిపారు. డీసీఈబీ పోస్టును జీహెచ్ఎంలలో సీనియార్టీ ప్రకారంగా రెండు సంవత్సరాలకు ఒకసారి మార్చాలని డీసీఈబీ సహాయ కార్యదర్శి పోస్టును కూడా మార్చాలని ఎస్ఏలలో సీనియర్‌ను నియమించాలని ఏ ప్రకటన లేకుండా నియామకాలు చేస్తున్నారని తెలిపారు. అక్రమ డిప్యూటేషన్‌లు ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ విద్యాశాఖలో మాత్రం లోప భూయిష్ట ఒప్పందాలతో డీఈవో కనుసన్నల్లో అధికారులైన ఎంఈవోల ద్వారా మౌఖికంగా ఎలాంటి ఆర్డర్ లేకుండా ఉన్నత అధికారుల ఆదేశాల ద్వారా అనేక అక్రమ డిప్యూటేషన్‌లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ యాదయ్య, బషీర్, ప్రవీణ్, రాజేష్, సంతోష్, రాజ్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 17 : పల్లెకు పోదాం పదండి - గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నాసాగర్, అజామాబాద్ 233, 234, 235 పోలింగ్ బూత్‌లలో ఇంటింటికీ తిరిగి మోదీ జాతీయస్థాయిలో సాధించినటువంటి విజయాలను అలాగే మన రాష్ట్ర ప్రగతికి కృషి చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాల గురించి, విజయాల గురించి కరపత్రం అందజేస్తూ మూడోసారి ప్రధాని మోదీని బీజేపీ అధికారంలో అవకాశం కల్పించాలని ప్రజలను కోరుకుంటూ దేశ శ్రేయస్సే ప్రధాని చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఎస్ఎన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేష్ పీకే, కిసాన్ మోర్చా అధ్యక్షులు సాయిరెడ్డి, సీనియర్ నాయకులు సంగారెడ్డి, శ్యామల వెంకటరెడ్డి, గంగాధర్, కృష్ణారెడ్డి, యశ్వంత్, అశోక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు



సోనియా, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కుల గణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలోనే బీసీ కులగణన చేపట్టాలని నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఎంతో మంది బీసీలు తీవ్రమైన అవస్థల్లో ఉన్నారన్నారు. బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రాంరెడ్డి, జంగంరాజు, శ్యామ్‌రావు, షౌకత్‌అలీ, లక్ష్మణ్‌చారి, రామచంద్రం, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నౌసిలాల్

మాచారెడ్డి, ఫిబ్రవరి 17: మాచారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నౌసిలాల్ నాయక్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా మినుకూరి బ్రహ్మానందరెడ్డిలు నియామకం అయ్యారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ సమక్షంలో జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో మండల కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేసి అత్యధిక మెజార్టీ ఓట్లు తీసుకువస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, బీబీపేట మండల అధ్యక్షుడు సుతారి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీ నుంచి నియామక పత్రం అందుకుంటున్న నౌసిలాల్‌నాయక్



మద్నూర్‌లో సిద్ధంగా ఉన్న అయోధ్య ప్రసాదం

వితరణకు సిద్ధంగా ఉన్న అయోధ్య ప్రసాదం

మద్నూర్, ఫిబ్రవరి 17: గత నెల జనవరి 22న అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరగగ అన్నీ గ్రామాల నుంచి భక్తులు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనకపోవడంతో అందరికీ ప్రసాదం అందే విధంగా పైడి ఎల్లారెడ్డి చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అందజేయడానికి ఏర్పాట్లు చేశారు. మద్నూర్ ఉమ్మడి మండలంలోని 34 గ్రామాలకు అందే విధంగా 20 వేల ప్రసాదం ప్యాకెట్లను పంపిణీ చేయడానికి ఆర్య సమాజ్‌లో సిద్ధంగా ఉన్నాయి. సోమవారం నంచి ఆయా గ్రామాల్లో ఇంటింటికీ అయోధ్య ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలకు ఆర్థిక సహాయం

రామారెడ్డి, ఫిబ్రవరి 17: మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈవిని ంగ్ స్నాక్స్ నిమిత్తం డాక్టర్ గిరెడ్డి రవీందర్‌రెడ్డి శనివారం రూ.15 వేలను అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి, సాయిలు, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామిగౌడ్ కుటుంబానికి అండగా ఉంటా

● మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

భిక్కనూరు, ఫిబ్రవరి 17: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి భార్యను కోల్పోయిన స్వామిగౌడ్ కుటుంబానికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శనివారం భిక్కనూరులో స్వామిగౌడ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, విండో చైర్మన్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

8 ద్విచక్ర వాహనాలు సీజ్

దోమకొండ, ఫిబ్రవరి 17: నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 8 ద్విచక్ర వాహనాలు, 1 ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. శనివారం దోమకొండలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌లపై సీఎం ఫొటో ముద్రించాలని వినతి

బాన్సువాడ, ఫిబ్రవరి 17: బాన్సువాడ పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌కు శనివారం కాంగ్రెస్ నాయకులు అంబులెన్స్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను ముద్రించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజుల్లోగా అంబులెన్స్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను ముద్రిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్, అంబర్‌సింగ్, అక్బర్, లాయక్, సలీం, తదితరులు ఉన్నారు.

కనక దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనను విజయవంతం చేయండి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 17: పట్టణంలోని సంగమేశ్వరా కాలనీలో ఈ నెల 19 నుంచి నిర్వహించబోయే కనక దుర్గాదేవి స్థిర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రేమల శంభురెడ్డి భక్తులను కోరారు. శనివారం విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రేమల మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 23 వరకు 5 రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సరితా, బెజుగం సత్యనారాయణ, సంతోష్‌శర్మ, రాజు తదితరులున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 17: ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగాలని డీపీఎం రమేష్‌బాబు తెలిపారు. శనివారం తాడ్వాయి మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా లక్పతి దీది అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ మహిళ గ్రూపుల ద్వారా రుణాలు తీసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ప్రతీ మహిళకు నెలకు రూ.10 వేల ఆదాయం వచ్చేలా ఆదాయ అభివృద్ధి జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రవీందర్‌రావు, జగదీష్, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 17: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని టీఎస్‌టీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని కాలానికి అనుగుణంగా సైన్స్ అండ్ టెక్నాలజీ మార్పులు గమనిస్తూ ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రణాళిక ప్రకారం వెళ్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంగారెడ్డి, కళ్యాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సృజనాత్మక పోటీల్లో రాష్ట్రస్థాయికి విద్యార్థి ఎంపిక

సదాశివనగర్, ఫిబ్రవరి 17: సృజనాత్మక పోటీలకు సదాశివ నగర్ నగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థి పెయింటింగ్ విభాగంలో లక్ష్మీ ప్రసన్న ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో ఉపన్యాస పోటీల్లో సంజన, కవిత్వ పోటీల్లో కీర్తి, పాటల పోటీల్లో ప్రత్యూష రాణించారని తెలిపారు. అదేవిధంగా సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో హెచ్.పృథ్వీరాజ్, రుచిత జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరికి గైడ్ టీచర్లుగా వ్యవహరించిన రాజేందర్, అరవింద్, వాసవిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజశేఖర్, దశరథ్, చిత్ర, అనిత, నీరజ, లింగమయ్యలు పాల్గొన్నారు.

విద్యార్థినులు తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలి

● ప్రిన్సిపాల్ జయకుమారి

బాన్సువాడ, ఫిబ్రవరి 17: విద్యార్థినులు తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల ప్రిన్సిపాల్ జయకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు తమ తల్లిదండ్రుల కష్టానికి ఫలితంగా వారి లక్ష్యానికి ధీటుగా కష్టపడి చదివి పేరు తీసుకురావాలని ఆమె కోరారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆమె కోరారు. కళాశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థినులు పోటీపడి మరీ భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాన్సువాడ డీఎస్పీగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

బాన్సువాడ, ఫిబ్రవరి 17: బాన్సువాడ డీఎస్పీగా శనివారం సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఇంటలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వహించిన సత్యనారాయణ బదిలీ ప్రక్రియలో భాగంగా బాన్సువాడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో బాన్సువాడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జగన్నాథరెడ్డి డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. డివిజన్‌లో శాంతి సామరస్యాలు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- ఊరు పేరు భైరవకోన
ప్రియా 70	- ఈగల్
ప్రియా 35	- రాజధాని ఫైల్స్

బాన్సువాడ

మహేశ్వరి	- ఊరు పేరు భైరవకోన
వెంకటేశ్వర	- లాల్ సలామ్

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210